క్లుప్తంగా

మొబైల్ ఫోన్ దుష్పరిణామాలపై అవగాహన



డాక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీశైల హైస్కూల్, భారతీ బీఈడీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మొబైల్ ఫోన్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ కంటి వైద్య నిపుణులు విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ ఎక్కువగా ఫోన్ వినియోగించడం వల్ల వచ్చే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి, ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం నబిసాహెబ్ పాల్గొన్నారు.

5కే మారథాన్‌లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నంద్యాలలో ద్వితీయ సంవత్సరం బీఎస్సీ మ్యాథ్స్ చదువుతున్న ప్రసన్న మంగళవారం జరిగిన జిల్లా స్థాయి 5కే మారథాన్ రన్నింగ్ పోటీల్లో ప్రతిభను కనబరిచి ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ విద్యార్థి చదువుతో పాటు 5కే మారథాన్‌లో ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. విద్యార్థినికి శిక్షణ కాలంలో కావాల్సినటువంటి వస్తువులను బహుమతిగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు దస్తగిరి, రాజశేఖర్, విజయానంద్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

నంద్యాల (వ్యవసాయం): కళారాధన నంద్యాల ఆధ్వర్యంలో నంద్యాల లయన్స్ క్లబ్, ఐఎంఏ సంయుక్త నిర్వహణలో, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో నిర్వహిస్తున్న మాతృభూమికి కళార్చన పోటీలలో భాగంగా మంగళవారం వివిధ అంశాలపై తెలుగు, హిందీ, ఇంగ్లిషు భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో 500 మంది వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవికృష్ణ, శర్మ, నాగరాజు, అమిదేల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. బుధ, గురు వారాలలో తెలుగు, ఆంగ్ల భాషలలో జూనియర్, సీనియర్ విభాగాలలో వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నంద్యాల(న్యూటౌన్): విశాఖ సీతమ్మ ధారలో ఆదివారం మైనర్ మూగబాలికపై అత్యాచారానికి పాల్పడ్డ యువకులను విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో ఉన్న కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సభ్యసమాజం తల వంచుకునేలా దివ్యాంగులపై కూడా అత్యాచారాలు జరుగుతుంటే రాష్ట్ర హోం మంత్రి అనిత మహిళ అయినప్పటికీ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారన్నారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు కిరణ్, కుమార్, జాకీర్, కేశవ, జైలాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష పదవి దళితులకే ఇవ్వాలి

గోస్పాడు: నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని దళితులకే ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలనాగన్న డిమాండ్ చేశారు. దళిత సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం గోస్పాడు మండల రెవెన్యూ ఆఫీస్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం దగ్గర దళితులు ఏకమై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబులేసు ఎమ్మార్పీఎస్ నాయకులు పాలకృష్ణ, వెంకటరమణ, సుబ్బారాయుడు, మద్దిలేటి, కొమ్ము మహేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

240 టన్నుల ఎరువులకు ప్రతిపాదనలు

ఉయ్యాలవాడ : త్వరలో ప్రారంభం కానున్న రబీ సీజన్‌కు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని సహకార పరపతి సంఘాలకు బోడెమ్మనూరు సహకార పరపతి సంఘానికి 20 టన్నుల డీఏపీ, 20-0-13 20 టన్నులు, 14-35-14 20 టన్నులు కాంప్లెక్స్ ఎరువులు కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే ఉయ్యాలవాడ, హరివరం, పెద్దయమ్మనూరు సహకార పరపతి సంఘాలకు కూడా పైన పేర్కొన్న ఇండెంట్ ప్రకారం జిల్లా మార్క్‌ఫెడ్ సంస్థకు నివేదికలు పంపినట్లు ఏఓ స్పష్టం చేశారు.



నంద్యాలలో అన్నదాతపోరుకు పెద్ద ఎత్తున హాజరైన రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆర్డీఓ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, శిల్పారవికిశోర్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి,ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

- అన్నదాత పోరుకు తరలివచ్చిన రైతులు
- కూటమి సర్కారు తీరుపై తీవ్ర నిరసన
- ఎరువుల కొరత తీర్చాలని డిమాండ్

కదం తొక్కి..గళమెత్తి!

బొమ్మలసత్రం: అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కదం తొక్కింది. కూటమి సర్కారు వైఫల్యాలపై గలమెత్తింది. కనీసం రైతులకు ఎరువులు అందించలేకపోతే ఎలా అని సర్కారును నిలదీసింది. మంగళవారం వైఎస్సార్‌సీపీ అధ్వర్యంలో నంద్యాలలో అన్నదాత పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, నంద్యాల మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్రమార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు భూమా కిషోర్‌రెడ్డి, పీపీ మధుసుదన్‌రెడ్డి, బుడ్డా శేషిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వంగాల మహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో యూరియా కొరత తీర్చాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేస్తూ ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఆర్డీవో విశ్వనాథ్‌ను కలిసి ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ తరలుతున్నాయని, అలాగే యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించి అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుదాల్‌మిల్ అమీర్, సూర్యనారాయణరెడ్డి, సెక్రెటరీ సోమశేఖర్‌రెడ్డి, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టీవై శివయ్య, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కారు రవికుమార్, దేవనగర్‌బాషా, మాజీ ఏపీఎస్‌డీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మండల కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

టెట్‌పై రివ్యూ పిటీషన్ వేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)పై సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించాలని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సర్వీసులో ఉన్న సీనియర్ టీచర్ల ప్రయోజనాల రక్షణ కోసం సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్లు దాఖలు చేయాలని ఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 2023న ఎన్‌సీటీఈ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. సుప్రీం కోర్టు డివిజన్ బెంచీ సెప్టెంబర్ 1న వెలువరించిన తీర్పు సీనియర్ ఉపాధ్యాయులకు అశని పాతంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యాయులు రామకృష్ణ, సురేష్, నాగరాజు, రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోళ్ల సుధాకర్

నానో ఎరువులతో ఖర్చు తగ్గించుకోవాలి

గోస్పాడు: పైర్లు సాగు చేసే రైతులు నానో ఎరువులు వాడి ఖర్చులు తగ్గించుకోవాలని ఏడీఏ విజయ్ శేఖర్ అన్నారు. మండలంలోని జూలేపల్లె గ్రామంలో మంగళవారం స్థానిక ఏఓ స్వప్నిక రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న పొలాల్లోని నేలలో భూసార పరీక్షల ఆధారంగా భాస్వరం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దుక్కిలో మాత్రమే భాస్వరం ఉండే ఎరువులు వేయాలని పై పాటుగా డీఏపీ వేయరాదన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ వైష్ణవి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నానో యూరియా భూమికి శ్రేష్టం

శిరివెళ్ల: నానో యూరియా వాడకం భూమికి శ్రేష్టమని ఏఓ సుధాకర్ అన్నారు. మంగళవారం వెంకటేశ్వరపురంలో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతు యూరియా వాడకంతో దుష్ఫలితాలు వస్తున్నాయన్నారు. భూసారం తగ్గిపోయి పంట విషపూరితంగా తయారువుతుందన్నారు. ప్రతి రైతు నానో యూరియా వాడకానికి మొగ్గు చూపాలన్నారు. యూరియాతో పోల్చిస్తే నానో యూరియాతో ఎన్నో లాభాలున్నాయని రైతులకు డెమో ద్వారా వివరించారు. భవిష్యత్‌లో యూరియా స్థానంలో నానో యూరియా వాడకం పెరుగుతుందని అందుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. ప్రస్తుతం అందరికి యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో పడి వృద్ధురాలి మృతి

నంద్యాల(అర్బన్): కాలు జారి కేసీ కెనాల్‌లో పడి వృద్ధురాలు చిన్నమ్మి అన్నమ్మ(70) మృతి చెందిన ఘటన నంద్యాల మండలం చాబోలు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు కెనాల్ లో పడి కొట్టుకొని పోయింది. బంధువులు గాలించగా దీబగుంట్ల వద్ద మృతదేహం లభ్యమైంది. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

ఉయ్యాలవాడ : మండలంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్ల అభివృద్ధి కోసం రూ. 3 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని ఆ శాఖ డీఈ రెడ్డి గోవిందు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె ఆర్‌అండ్‌బి రహదారిలో ఇంజేడు గ్రామం నుంచి ఆర్.జంబులదిన్నె వరకు 6 కిలో మీటర్లు తారురోడ్డు నిర్మాణానికి రూ. 2కోట్లు, ఉయ్యాలవాడ నుంచి సుద్దమల్ల వరకు 4 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 1కోటి వ్యయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తైందని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు డీఈ స్పష్టం చేశారు.

పంచాయతీలకు నిధుల మంజూరు

దొర్నిపాడు: మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవత్సరం రెండో విడతా 15 ఆర్థిక సంఘం నిధులు విడుదల ఆయినట్లు ఎంపీడీఓ సావిత్రి మంగళవారం తెలిపారు. అమ్మిరెడ్డినగరం 68,159, అర్జునాపురం రూ.85072, బుగ్రారెడ్డిపల్లె రూ.1,53,484, చాకరాజువేముల రూ.5,45,141, దొర్నిపాడు రూ.7,27,120, గుండుపాపల రూ. 2,62,926, కొండాపురం 1,47,281, క్రిష్టిపాడు రూ.2,62,926, రామచంద్రాపురం రూ.1,79,595, డబ్ల్యూ గోవిందిన్నె 3,67,444, డబ్ల్యూ కొత్తపల్లె రూ. 3,43,781 నిధులు వచ్చాయన్నారు. ఈనిధులను గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు, తాగునీరు మరమ్మతులకు వెచ్చించాల్సి ఉందన్నారు.

జూనియర్ న్యాయవాదికి ఆర్థిక సాయం

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జూనియర్ న్యాయవాదికి నంద్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళ వారం ఆర్థిక సాయం అందజేసి మానవత్వాన్ని చాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, కృష్ణారెడ్డి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాది సురేష్‌కు రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైందన్నారు. అత్య వసర ఆపరేషన్ నిమిత్తం తోటి న్యాయవాదులు స్పందించి లక్షా పదకొండు వందల రూపాయలు పోగుచేసి సురేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. సహకారం అందించిన న్యాయవాదులందరికీ బార్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలియజేశారు.

పంటల సాగుపై అవగాహన అవసరం

చాగలమర్రి: రైతులకు పంటల సాగుపై పూర్తి స్థాయి అవగాహన అవసరమని ఏఓ రంగనేతాజి అన్నారు. మంగళవారం ఆయన శెట్టివీడు గ్రామంలో రైతులతో కలిసి పోలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంట సాగుపై అవగాహన కల్పిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వాడాల్సిన ఎరువలు గురించి వివరించారు. నానో ఎరువులు భూమిని సారవంతం చేస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కుందూలో కృత్రిమ వరదలను నివారించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి విడుదల చేస్తున్న కృష్ణాజలాల్లో సగానికి పైగా కుందూ నదిలోకి వస్తున్న కృత్రిమ వరదలతో రైతుల పంట పొలాలు జలమయమవుతున్నాయని, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. కుందూలోకి విడుదల చేసే నీటిని తగ్గించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెలుగోడు రిజర్వాయర్ స్పిల్ గేట్ల నుంచి గాలేరు నదిలోకి వచ్చే నీటిని తక్షణమే ఆపాలన్నారు. కుందూ వరద నీటితో పాములపాడు, కోవెలకుంట్ల, పెద్దముడియం తదితర మండలాల్లో పంట పొలాలు నీట మునుగుతున్నాయన్నారు. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు కృష్ణా జలాలను తీసుకొని పోయే ప్రధాన కాల్వ సామర్థ్యాన్ని 22వేల క్యూసెక్కులకు పెంచినా కొన్ని వంతెనలు, నిర్మాణాలు పూర్తికాకపోవడంతో 10వేల క్యూసెక్కులకు మించి నీటిని తరలించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆయన వెంట సమితి ఉపాధ్యక్షులు వైఎస్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, కృష్ణమోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

చాగలమర్రి: మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పీఆర్‌టీయూ ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి అన్నారు. మంగళవారం రెండవ విడతగా మండలంలోని మద్దూరు, చిన్నవంగలి, గోడిగనూరు, చాగలమర్రి బాలుర, బాలికోన్నత పాఠశాలలకు రూ. 50,000 విలువ చేసే రెండు బీరువాలు, 5 ఐరాన్ ర్యాక్ స్టాండ్లను వితరణగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు తక్కువగా ఉన్న పాఠశాలల్లోలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురికాకుండా తమ సంఘం ఆధ్వర్యంలో వస్తువులు వితరణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహబూబ్‌బాషా, జీవయ్య, సుధాకర్ గుప్తా, శివలక్ష్మి, మండల అధ్యక్షుడు మౌలాలి, జిల్లా నాయకులు నారాయణమూర్తి, రవి ప్రకాష్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, షరీఫ్, దస్తగిరి, శిరామకృష్ణ, సురేష్ బాబు, శ్రీనివాసులు, తాహెరా బేగం, సుధా కుమారి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక పూర్తి



బాలుర జట్టు



బాలికల జట్టు

శిరివెళ్ల: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్ల ఏంపిక పూర్తయ్యింది. మంగళవారం యర్రగుంట్ల జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా బాలికల, బాలుర పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగింది. జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, చాగలమర్రి, గాజులపల్లె, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాలుర జట్టు ఎంపికకు 77 మంది హాజరు కాగా అందులో 10 మంది ఎంపికయ్యారు. బాలికల జట్టు పోటీలకు 55 మంది హాజరు కాగా 10 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఈ నెల 14న కర్నూల్‌లోని గుడ్ షెఫర్డ్ స్కూల్ మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్-12 విభాగం పోటీలు జరుగుతాయన్నారు. ఎంపికయిన జట్లకు 10, 11, 12 తేదీలలో యర్రగుంట్ల మైదానంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమార్, పీడీలు సురేష్, షేక్షావలి, సుబ్బరాయుడు, రత్నకుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఏ కోడూరు గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్ చేసి, ఆటోను సీజ్ చేశామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేయగా నంద్యాలలోని ఫరూక్ నగర్‌కు చెందిన గౌస్ బాషా ఏపీ 21టీటీ 9118 ఆటోలో 13 బస్తాల బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతడిపై కేసు నమోదుచేసి, ఆటోను సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

ఐక్యతను చాటి చెప్పేందుకే ఎన్‌సీసీ క్యాంపులు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ ఐక్యతను చాటి చెప్పేందుకే ఎన్‌సీసీ జాతీయ స్థాయిలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి అన్నారు. మంగళవారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎన్‌సీసీ కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి, 9వ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జోబిపిలిప్స్ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నముఖ అన్నారు. బిహార్, జార్ఖండ్, గుంటూరు, తిరుపతి, విజయవాడ, కాకినాడల నుంచి ఎన్‌సీసీ కేడెట్లను తీసుకొని వచ్చి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్ రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ లక్ష్మీదుర్గా, లలితాసరస్వతి, కమాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న కల్నల్ అలోక్ త్రిపాఠి



ఇళ్లలోకి వచ్చిన నీటిని చూపుతున్న దృశ్యం



ఇళ్ల ముందు నిల్వ ఉన్న పంటకాల్వల నీరు

ఇళ్లలోకి నీళ్లు

దొర్నిపాడు:వానలు లేవు.. వరదలు అంతకన్నా రావు.. మరి గుడిసెల్లోకి నీరు ఎలా ప్రవహిస్తుందనుకుంటున్నారు కదూ. పంటకాల్వలు పొంగి నీళ్లు ఇలా ఇళ్లలోకి వస్తున్నాయి. మండలకేంద్రం దొర్నిపాడు ఎస్సీకాలనీలోని రామాలయం సమీపంలో ఉండే వారు ప్రతి ఏటా ఇలా నీటిలో జీవనం సాగించాల్సి వస్తుంది. ఎప్పుడూ నీటి ప్రవాహంతో రాత్రివేళల్లో విషపురుగులు సంచరిస్తున్నాయి. పంటకాల్వలు పూడిపోవడంతో నీరంతా పొంగి తమ గుడిసెల్లోకి వస్తున్నాయని వాపోతున్నారు. అంతేగాక నీటి నిల్వలను దోమలు ఆవాసాలుగా మార్చుకున్నాయి. దీంతో చీకటి పడితే చాలు అవి ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. అధికారులు స్పందించి కాల్వల నీరు ఇళ్ల మధ్యకు రాకుండా చూడాలని వారు కోరుతున్నారు.



ధ్వంసమైన పంటకాల్వ

పంటకాల్వలు శిథిలం

దొర్నిపాడు:పంటకాల్వలు ధ్వంసం కావడంతో చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. దొర్నిపాడు, భాగ్యనగరం, రామచంద్రాపురం, కొండాపురం గ్రామాల రైతులు చాలా మంది తమ వరిపంట సమీపంలోని పంటకాల్వ కట్టలను సైతం వదలడం లేదు. ప్రతి ఏటా కట్టలపై కంది పంటను సాగుచేస్తున్నారు. దీంతో ట్రాక్టర్ల ద్వారా సేద్యం చేయడంతో పంటకాల్వలు ధ్వంసమవుతున్నాయి. అంతేగాక ఎక్కడ బడితే అక్కడ నీటిమళ్లింపులకు కాల్వలను పగలుగొట్టి దారులు లేర్పాటు చేస్తున్నారు. లైనింగ్‌లు పగుళ్లు ఇవ్వడంతో నీరంతా వృథా అవుతూ చివరి పంటలకు చేరడం లేదు. అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాల్వల నిండా పేరుకు పోయిన గడ్డి

బస్సుల్లేక..

- గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు అవస్థలు
- జిల్లా నుంచి 280కి పైగా బస్సులు అనంతపురానికి తరలింపు
- ప్రైవేటు స్కూల్ బస్సులను సైతం వదలని వైనం



నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

నంద్యాల(వ్యవసాయం): ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం పర్యటన సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తోంది. నంద్యాల నుంచి 280కు పైగా బస్సులు తరలివెళ్లడంతో ప్రయాణికులు, విద్యార్థులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఎన్నికల ముందు పార్టీ కార్యక్రమాలకు ఆర్టీసీ బస్సులను వినియోగించబోమని తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక ప్రతి కార్యక్రమానికి ఆర్టీసీ బస్సులను వినియోగించుకుంటోంది. మొన్న వైఎస్సార్ కడపలో జరిగిన మహానాడుకు 200 బస్సులు, అమరావతిలో జరిగిన మరో కార్యక్రమానికి 115 బస్సులు, ఆ తర్వాత విశాఖలో జరిగిన యోగాంధ్రకు 30 బస్సులు తరలించారు. నేడు అనంతపురంలో జరిగే సూపర్‌సిక్స్ సూపర్ హిట్ సభకు జనాన్ని తరలించేందుకు ఏకంగా వందల సంఖ్యల బస్సులు తీసుకెళ్లింది. దీంతో జిల్లాలోని ఏడు డిపోల్లో బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. గంటల తరబడి వేచి చూశారు. కొందరు ఆటోలు, ప్రైవేటు వాహనాలు ఎక్కి ఇళ్లకు వెళ్లారు.

అవసరం 750..ఉన్నవి 410 బస్సులు..

జిల్లా వ్యాప్తంగా 7 డిపోల్లో 410 బస్సులున్నాయి. వీటిలో నిత్యం 25 సర్వీసులు మరమ్మతుల్లో ఉంటున్నాయి. మిగిలిన 385 బస్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రయాణికుల సంఖ్యతో పోల్చి చూస్తే ఇవి ఏమూలకూ సరిపోవడం లేదు. జిల్లాకు ప్రస్తుత అవసరాలమేరకు 750 సర్వీసులు అవసరం. 340 బస్సులు కేటాయించాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి సర్కారు పదే పదే ఉన్న అరకొర బస్సులను వాడేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆళ్లగడ్డ నుంచి 43, ఆత్మకూరు నుంచి 39, బనగానపల్లె నుంచి 41, డోన్ నుంచి 29, కోవెలకుంట్ల నుంచి 34, నంద్యాల నుంచి 53, నందికొట్కూరు నుంచి 41 బస్సు సర్వీసులు ఆనంతపురం సభకు తరలించారు.

ఇలా చేస్తే ఎలా



కాల్వబుగ్గ నుంచి సొంత పనికి నంద్యాలకు వచ్చాను. పని ముగించుకొని తిరుగు ప్రయాణం కోసం మధ్యాహ్నం 1గంట నుంచి బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్నా. బస్సులు సీఎం సభకు వెళ్లాయని అధికారులు చెబుతున్నారు. ఏం చేయాలో తెలియక ఆటో కోసం బస్టాండ్ బయటకు వస్తే ఒక్కొక్కరికి రూ.200 చార్జి అడుగుతున్నారు. దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. –సుబ్బమ్మ, ప్రయాణికురాలు

సీఎం సభకు బస్సులు... విద్యార్థులకు తిప్పలు

ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలు సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సీఎం సభ ఎక్కడ జరిగినా విద్యార్థులకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. జనాన్ని తరలించేందుకు బస్సులు పంపాలని అధికారులు తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నారు. దీంతో విద్యాలయాల నిర్వాహకులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా బుధవారం అనంతపురంలో జరిగే సూపర్ 6 సూపర్ హిట్ సభకు జనసమీకరణ కోసం ఆర్టీసీ బస్సులను కేటాయించాలని హుకుం జారీచేయడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు అనధికార సెలవు ప్రకటించారు. రోజు సాయంత్రం వచ్చే విద్యార్థి బస్సులు ఈ రోజు, రేపు రావాని, దీంతో మీరు ఇళ్లకు వెళ్లాలని ఉపాధ్యాయులు సూచించడంతో విద్యార్థులు మధ్యాహ్నం నుంచి వెళ్లిపోయారు. కాగా రేపు కూడా విద్యార్థి బస్సులు తిరగవని అవకాశం ఉంటే రండి లేకుంటే గురువారం పాఠశాలకు రమ్మని అనధికారికంగా విద్యార్థులకు సూచించినట్లు సమాచారం. మరికొద్ది రోజుల్లో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సెలవులు ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

50 బస్సుల్లో 43 బస్సులు మీటింగ్‌కు

ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోలో మొత్తం 50 బస్సులు ఉండగా ఇందులో 43 బస్సులు ముఖ్యమంత్రి సభకు కేటాయించడం జరిగింది. దీంతో 7 బస్సులు మాత్రమే బుధవారం సాయంత్రం వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి బస్సులు ఆయా గ్రామాలకు వెళ్లడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఎం సభ జరిగిన ప్రతిసారీ తమకు ఈ ఇబ్బందులు ఏంటని అధికారులను గట్టిగా ప్రశ్నించినట్లు సమాచారం